

ఇవాళ వండినవే రేపు...

ఖమ్మంలోని పలు హోటళ్లలో మిగిలిన ఆహార పదార్థాలనే మరునటి రోజు ఉపయోగిస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. 8లో



లైసెన్స్ తప్పనిసరి

మిరప నారు పెంచే నర్సరీల యాజమాన్యాలు లైసెన్స్ తీసుకోవడమేకాక నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
43° / 33°

వాతావరణం

జిల్లా అంతటా సోమవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్ట స్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

ఘనంగా 108 పైలట్ల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న పైలట్లు

ఖమ్మంవైద్యవిభాగం: నేషనల్ ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్‌లో పనిచేస్తున్న 108 వాహనాల పైలట్ల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఖమ్మం పెద్దాస్పత్రిలోని ఉమ్మడి జిల్లా 108 కార్యాలయంలో పైలట్లు ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ భూమా నాగేందర్, కోఆర్డినేటర్ ప్రణయ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ జట్ల ఎంపికకు 154మంది



ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల జట్ల ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించగా 154మంది బాలబాలికలు హాజరయ్యారు. ఎంపికల పోటీలను అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ. గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్‌తో పాటు ఎం.సుధాకర్, కృష్ణయ్య, రవి, నక్క వెంకటేశ్వర్లు, తిరుపతి, కృష్ణ పర్యవేక్షించారు. కాగా, అండర్–8 బాలబాలికల విభాగంలో ఎం.వివేక్, టి.కృష్ణ, జె.సాత్విక, సీహెచ్.లాస్యశ్రీ, డి.అనుశ్రీ, అండర్–10లో బి.దక్షిత్, డి.లోహిత, ఎం.భవిత, అండర్–12లో అశ్విత, అండర్–14లో సీహెచ్.సాయిభరత్, కృష్ణ, అండర్–16 విభాగంలో కె.మస్తార్, బి.లోకేష్, మనుశ్రీ, వైశాలి ఎంపికయ్యారు. అలాగే, అండర్–18 విభాగంలో పి.గోపీచంద్, కె.అశోక్, డి.నవ్యశ్రీ, డి.బింధు, అండర్–20లో ఎం.మనీషా, సింధుప్రియ, పురుషుల విభాగంలో బి.అఖిల్, పి.వేణు, అఫ్తాబ్, మహిళల విభాగంలో ఎ.మైథిలి, హాజీరా ఫాతిమా ఎంపికయ్యారని, వీరు జూన్ 6, 7వ తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ బాధ్యులు వెల్లడించారు.

జిల్లా నెట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపిక పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ నెట్‌బాల్ జట్ల ఎంపికకు ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 34 మంది పురుషులు, 24మహిళలు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చాటిన 13మంది పురుషులు, 12మంది మహిళలతో ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఫణికుమార్ తెలిపారు. ఈ జట్లకు మూడు రోజులపాటు శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వైద్యుల సూచనలు పాటించాలి

భద్రాచలంటౌన్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల బారి నుంచి బయటపడేందుకు ప్రతీ ఒక్కరు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. గిరిజనుల్లో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికైనా షుగర్, బీపీ ఉంటే ఆశ వర్కర్, ఏఎన్‌ఎంల వద్ద పేరు నమోదు చేయించుకోవాలని, పీహెచ్‌సీల్లో ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడాలని తెలిపారు. జ్వరం వస్తే వెంటనే రక్తపరీక్ష చేయించుకుని వైద్యుల సలహా మేరకు మందులు వేసుకోవాలని పేర్కొన్నారు. కేన్సర్, ఇతర జబ్బుల నివారణకు 'ఈ సంజీవని' ద్వారా నిపుణులైన వైద్యుల సలహాలు పాటించాలని తెలిపారు. నాలుగు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, తరచూ జ్వరం వస్తే క్షయ పరీక్ష చేయించుకోవాలని, క్షయగా నిర్ధారణ అయితే చికిత్స పొందాలని పీఓ వివరించారు.

పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న ఉద్యోగులు



బ్యాలెట్ బాక్సులను తీసుకెళ్తున్న హమాలీలు



కూసుమంచిలోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై ఆరా తీస్తున్న జెడ్పీ సీఈఓ వినోద్



పోలింగ్‌కు రెడీ..

నేడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- ఉమ్మడి జిల్లాలో 173 పోలింగ్ కేంద్రాలు
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి తరలిన ఉద్యోగులు
- ఓటుహక్కు వినియోగించుకోనున్న 1,23,985 మంది పట్టభద్రులు



ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం : నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నికకు అంతా సిద్ధమైంది. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1,23,985 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల, కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ల సెంటర్ల నుంచి ఉద్యోగులు ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. ఈ మేరకు సామగ్రి పంపిణీని కలెక్టర్లు వీ.పీ.గౌతమ్, ప్రియాంక ఆల పరిశీలించి పోలింగ్ సాఫీగా జరిగేలా ఉద్యోగులకు సూచనలు చేశారు.

ఏర్పాట్లు పూర్తి..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, ఉమ్మడి జిల్లాలో 173 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు ఖమ్మం జిల్లాలో 142 మంది చొప్పున ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 284 మంది అదర్ పోలింగ్ ఆఫీసర్లు విధులు నిర్వర్తిస్తారు. అలాగే, భద్రాద్రి జిల్లాలో పీఓ, ఏపీఓలు 55 మంది చొప్పున, ఓపీఓలు 110 మందిని కేటాయించారు. రెండు జిల్లాల్లో కలిపి రిజర్వ్‌తో సహా 199 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. ఎన్నికను 25 మంది సెక్టార్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారు. పోలింగ్ ఉద్యోగుల కు ఇప్పటికే మొదటి విడత శిక్షణ పూర్తి కాగా.. రెండో విడత శిక్షణ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద ఆదివారం ఇచ్చారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి..

పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఆదివారం తమకు కేటాయించిన కేంద్రాలకు బయలుదేరారు. ఖమ్మంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల, కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటుచేయగా సామగ్రి తీసుకున్న ఉద్యోగులు బస్సుల్లో కేంద్రాలకు వెళ్లారు. కాగా, సామగ్రి తరలించిన వాహనాలతో పాటు సెక్టార్ ఆఫీసర్లకు కేటాయించిన వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్‌ను అమర్చారు. పోలింగ్ ముగిశాక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బ్యాలెట్ బాక్సులను తొలుత ఖమ్మంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలకు చేర్చి ఆ తర్వాత నల్లగొండలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించనున్నారు.

1,23,985 మంది ఓటర్లు..

పట్టభద్రుల ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,23,985 మంది ఓటర్లు ఉన్నారు. వీరిని పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చి ఓటు వేయించేలా అభ్యర్థులు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. పట్టభద్ర ఓటర్లు పరిమిత సంఖ్యలోనే ఉండటంతో ఓటరు జాబితాల ద్వారా అభ్యర్థులు, వారి అనుయాయులు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి మరీ అభ్యర్థించారు. ఖమ్మం, ఖమ్మం రూరల్, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు తదితర ప్రాంతాల్లో పట్టభద్ర ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాలపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.

ఎన్నికల ఉద్యోగులు

	ఖమ్మం జిల్లా	భద్రాద్రి జిల్లా
పీఓలు	142 మంది	65 మంది
ఏపీఓ	142 మంది	65 మంది
అదర్ పోలింగ్ ఆఫీసర్లు	284 మంది	152 మంది
సెక్టార్ ఆఫీసర్లు	15 మంది	10 మంది
బ్యాలెట్ బాక్సులు	140	55

ఓటర్లు

	ఖమ్మం జిల్లా	భద్రాద్రి జిల్లా
పురుషులు	50,676	22,590
మహిళలు	33,199	17,516
ఇతరులు	04	00

మొత్తం పోలింగ్ స్టేషన్లు	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం	బరిలో ఉన్న అభ్యర్థులు
173	118	55	52 మంది



విధులు సమర్థవంతంగా నిర్వర్తించండి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధులను ఉద్యోగులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ. గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆదివారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, ఉదయం 7:30 గంటల కల్లా ఏజెంట్ల సమక్షాన బ్యాలెట్ బాక్సులకు సీల్ వేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్ల కంటే ఎక్కువగా ఉంటే, రెండు కంపార్ట్‌మెంట్లు ఏర్పాటుచేసుకోవాలన్నారు. పోలింగ్ ముగిశాక ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలకు బ్యాలెట్ బాక్సులను చేర్చి, ఇక్కడి నుంచి నల్లగొండలోని స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చాల్సి ఉంటుందని తెలిపారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఆర్డీఓలు జి.గణేష్, ఎల్.రాజేందర్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, మాస్టర్ ట్రెయినీలు కె.శ్రీరామ్, మదన్‌గోపాల్, ఉద్యోగులు అరుణ, రాళ్లబండి రాంబాబు పాల్గొన్నారు. కాగా, పోలింగ్‌ను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన వెబ్‌క్యాస్టింగ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. సీపీఓ ఎ.శ్రీనివాస్, ఈడీఎం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు ఎలా వేయాలంటే..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సాధారణ ఎన్నికలతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. సాధారణ ఎన్నికల్లో అభ్యర్థులకు గుర్తులు, ఓటు వేసేందుకు ఈవీఎం యంత్రాలు ఉంటాయి. వీటిపై అభ్యర్థి పేరుతోపాటు గుర్తు కూడా ఉండడంతో ఓటు వేయడం సులభంగా ఉంటుంది. కానీ పట్టభద్రుల ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ విధానం అమలవుతుండగా, పేపర్‌పై అభ్యర్థుల పేరు మాత్రమే ఉంటుంది. పోలింగ్ బూత్‌లో అధికారులు ఇచ్చే పెన్నుతోనే మనకు నచ్చిన అభ్యర్థి ఫొటో పక్కన ప్రాధాన్యత క్రమంలో నంబర్ వేయాల్సి ఉంటుంది. మొదటి ప్రాధాన్యత ఓటు మాత్రం తప్పకుండా వేయాల్సి ఉండగా.. ఆపై ఎందరికి వేసినా పరిగణనలోకి తీసుకుంటారు.

ఆయిల్‌పామ్‌తో భరోసా, భద్రత



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన రైతు సంఘాల నాయకులు

- కంపెనీలు నాణ్యమైన మొక్కలనే ఇవ్వాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: నికర ఆదాయం భరోసా కలిగిన అయిల్‌పామ్‌ను రైతులు ఎలాంటి భయం లేకుండా సాగు చేసుకోవచ్చని.. ఇందుకు తానే ఉదాహరణ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్రంలోని 29 జిల్లాల్లో పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగుకు కేంద్రప్రభుత్వం అనుమతించిన నేపథ్యాన రైతులు ముందుకొచ్చేలా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. రఘునాథపాలెంలో గోద్రేజ్ కంపెనీ ఆధ్వర్యాన ఆదివా రం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం దిగుమతి సుంకం తగ్గించడంతో ఆయిల్‌పామ్ గెలల ధరలు తగ్గాయని.. ప్రస్తుతం ఏటా రూ.లక్ష కోట్ల విలువైన నూనె దిగుమతి అవుతున్నందున ఇక్కడ ఎంత సాగు చేసినా ఢోకా ఉండదని చెప్పారు. రైతులకు డ్రిప్ సౌకర్యం కూడా తిరిగి పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగవుతున్నందున ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు మంత్రి చెప్పారు. కాగా, ఆయిల్‌పామ్ మొక్కల విషయంలో కంపెనీలు నాణ్యమైనవే కాక పొట్టి రకం, తక్కువ ఆకులు కలిగినవి ఇస్తే అంతర పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని వివరించారు. గెలలకు కనీస మద్దతు ధర రూ.16 వేల నుంచి రూ.18 వేల వరకు ఉండాలని.. కనీసం రూ.15 వేలైనా అందితే రైతులకు లాభంగా ఉంటుందని తెలిపారు. కాగా, రైతు సంక్షేమాన్ని విస్మరించి సొంత లాభమే ముఖ్యంగా భావించే కంపెనీల లైసెన్సు రద్దుచేస్తామని మంత్రి హెచ్చరించారు. ఇక కాల్వలు, జాతీయ రహదారులకు భూములు ఇచ్చే రైతులకు నష్టం జరగకుండా సముచిత పరిహారం అందించేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, కార్పొరేటర్లు మల్లీదు జగన్, వెంకటేశ్వరరావు, వివిధ పార్టీలు, రైతు సంఘాల నాయకులు మానుకొండ రాధాకిషోర్, నల్లమల వెంకటేశ్వరరావు, పోతినేని సుదర్శన్, దొండపాటి రమేష్, గుత్తా వెంకటేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, గోద్రేజ్ కంపెనీ ప్రతినిధి చావా వెంకటేశ్వరరావు, శాస్త్రవేత్త ప్రసాద్, మక్కశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రగిరిలో కొనసాగిన భక్తుల రద్దీ

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం వైభవంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. ఆ తర్వాత స్వామివారి ఉత్సవ మూర్తులను చిత్రకూట మండపానికి తీసుకొచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, ఈ వేడుకలో 115 జంటలు పాల్గొనడం విశేషం.

పోటెత్తిన భక్తులు..

వేసవి సెలవులకు తోడు ఆదివారం ఇతర కార్యాలయాలకు కూడా సెలవు కావడంతో రామయ్య దర్శనానికి భక్తులు పోటెత్తారు. భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం శ్రీరామ నామస్మరణలతో మార్మోగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారి దర్శనానికి బారులు దీరారు.

ఓట్ల లెక్కింపు అత్యంత కీలకం



కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓట్ల లెక్కింపు విషయంలో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు వచ్చే నెల 4న జరగనుండగా, ఉద్యోగులకు కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరగనుందని తెలిపారు. ఖమ్మం లోక్‌సభ పరిధిలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక హాల్ చొప్పున ఏడు హాళ్లు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు మరో హాల్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్‌లోని ప్రతీదశలో ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. డీఆర్వో రాజేశ్వరి, శిక్షణ నోడల్ అధికారి కె.శ్రీరామ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...



తిరుమలాయపాలెం మండలంలోని చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు (ఫైల్)

- జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నికకు కసరత్తు
- ఐదేళ్ల తర్వాత కమిటీకి మోక్షం
- రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న సంఘాలు
- మూడు నెలల్లో షెడ్యూల్, ఆపై ఎన్నిక

ఖమ్మంవ్యవసాయం: జిల్లా మత్స్య సహకార సంఘం నూతన కమిటీ ఎన్నికకు కసరత్తు మొదలైంది. గ్రామ, పట్టణ స్థాయిలో ఉన్న మత్స్య సహకార సంఘాలకు నూతన కమిటీలు ఏర్పాటైన నేపథ్యాన జిల్లా కమిటీ ఎన్నికకు మార్గం సుగమమైంది. రానున్న మూడు నెలల్లో జిల్లా మత్స్య సహకార సంఘం కమిటీ ఎన్నిక పూర్తి చేయాలని జిల్లా మత్స్యశాఖ యంత్రాంగం భావిస్తోంది. ఈ విషయంలో గ్రామ, పట్టణ మత్స్య సహకార సంఘాల బాధ్యులకు అవగాహన కల్పిస్తూ, సభ్యత్వం పొందే అవకాశం కల్పించారు. గ్రామ, పట్టణ స్థాయి మత్స్య సహకార సంఘాల ఎన్నికల జాప్యంతో జిల్లా సంఘం ఎన్నికకు జాప్యం జరగగా.. ఐదేళ్ల నుంచి పాలకవర్గం లేకుండా పోయింది.

2019లో లాస్ట్

గ్రామ, పట్టణ మత్స్య సహకార సంఘాల పాలకవర్గాల కాలపరిమితి 2019లో ముగిసింది. ఆ సమయాన నూతన పాలక వర్గాల ఎన్నికకు మత్స్య శాఖ శ్రీకారం చుట్టినా కోవిడ్ కారణంగా ప్రక్రియ ముందుకు సాగలేదు. దీనికి తోడు ఎన్నికలు నిర్వహించే సహకార శాఖ వివిధ అంశాల పరిశీలన పేరుతో జాప్యం చేసింది. మళ్లీ ఇప్పుడు జిల్లాలో గ్రామ, పట్టణ స్థాయి మత్స్య సహకార సంఘాలకు ఎన్నికలు పూర్తికావడంతో జిల్లా సంఘం ఎన్నికకు మార్గం ఏర్పడినట్లయింది. జిల్లాలో పుష్కలమైన నీటి వనరులు ఉండడం.. మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్న వారు వేలల్లో ఉండడంతో సహకార పాలక వర్గానికి ప్రాధాన్యత ఉంది.

1,129 జలాశయాలు

మత్స్య సంపద పుష్కలంగా ఉన్న జిల్లాల్లో ఖమ్మం ఒకటి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల అభివృద్ధికి అనేక పథకాలను అమలుచేస్తుండడంతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. జిల్లాలో 1,129 జలాశయాలు మత్స్య సంపదకు ఆధారంగా ఉండగా 14,700 మంది మత్స్యకారులకు జీవనోపాధి పొందుతున్నారు. ఏటా జిల్లాలో 14 వేల టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతున్నట్లు అంచనా. రూ.కోట్ల విలువైన మత్స్య సంపదకు అవకాశం ఉన్న జిల్లాలో ఐదేళ్లుగా జిల్లా మత్స్య సహకార సంఘం పాలకవర్గానికి ఎన్నిక జరగకపోగా.. ఇప్పుడు ప్రక్రియ మొదలుకావడంతో మత్స్యకారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

రిజిస్ట్రేషన్లు ప్రారంభం

జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నికకు గ్రామ, పట్టణ స్థాయిలో ఉన్న మత్స్య సహకార సంఘాలు రిజిస్టర్ చేసుకుంటున్నాయి. జిల్లాలో మొత్తం 210 సంఘాలకు గాను 14,700 మంది మత్స్యకారులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఆయా సంఘాల్లో ఐదేళ్ల పదవీకాలం పూర్తయి నూతన సంఘాన్ని ఎన్నుకుంటే జిల్లా సంఘం ఎన్నికలో పాల్గొనే అర్హత సాధిస్తాయి. ఈ అంశంపై మత్స్య శాఖ అధికారులు కల్పించిన అవగాహనతో రూ.1,500 చొప్పున రుసుము చెల్లించి 180 సంఘాల బాధ్యులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. మిగతా సంఘాల వారికి కూడా అవగాహన కల్పించి రానున్న మూడు నెలల్లో జిల్లా సంఘం ఎన్నిక నిర్వహించాలనే యోచనలో అధికారులు ఉన్నారు.

రిజిస్ట్రేషన్ కొనసాగుతోంది..



జిల్లా మత్స్య సహకార సంఘం నూతన పాలకవర్గం ఎన్నిక నిర్వహించనున్నారు. గ్రామ, పట్టణ స్థాయిలో నూతనంగా ఎన్నికైన మత్స్య సహకార సంఘాల రిజిస్ట్రేషన్ జరుగుతోంది. ఇది పూర్తయ్యాక రాష్ట్ర మత్స్య శాఖ విడుదల చేసే షెడ్యూల్ ప్రకారం కమిటీ ఎన్నిక చేపడుతాం. ఈ ప్రక్రియకు మూడు నెలల సమయం పట్టే అవకాశముంది.

– డి.ఆంజనేయ స్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

క్లుప్తంగా

ఎంపీ చేయూతతో సత్తా చాటిన విద్యార్థులు


విద్యార్థులతో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు విద్యార్థుల కష్టాన్ని గుర్తించిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర చేయూతనివ్వగా కష్టపడి చదువుకుని ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం తనను కలిసిన విద్యార్థులను ఎంపీ అభినందించారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడికి చెందిన మొగిలిశెట్టి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు కొన్నాళ్ల కిందట మృతి చెందగా, వారి కుమారులు శశిఅభినయ్, పవన్ విలాస్‌ను పోషించే స్థోమత నానమ్మ, తాతయ్యకు లేకపోవడంతో తనికెళ్లలోని అమ్మమ్మ ఇంటికి చేరుకున్నారు. అక్కడ కూలీ పనులు చేసుకోవాలని నిర్ణయించుకున్న వారి కష్టాన్ని తెలుసుకున్న ఎంపీ రవిచంద్ర రూ.1.60 లక్షల చొప్పున రూ.3.20 లక్షల ఫీజు చెల్లించి ఖమ్మంలోని రెజొనెన్స్ కాలేజీలో ఇంటర్ చదివించారు. ఈ మేరకు ఒకరు 956 మార్కులు, ఇంకొకరు 910 మార్కులు సాధించగా ఎంపీని కలిసి కృతజ్ఞతలు తెలపడంతో ఆయన అభినందించారు.

భద్రగిరిలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీకి చెందిన భక్తులు విరాళం అందజేశారు. విశాఖపట్నానికి చెందిన ఎస్.అనంతరావు – శ్రీలక్ష్మి దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని అధికారులకు అందజేసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం అర్చకులు విశేష పూజలు చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, ఒడి బియ్యం, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఈఓ సుదర్శన్ ఏర్పాట్లు చేశారు. కాగా, అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచలోని గట్టాయిగూడేనికి చెందిన దుర్గాప్రసాద్ – శిరీష దంపతులు రూ.5,016 విరాళంగా అందజేశారు.

బౌద్ధక్షేత్రంపై నిర్లక్ష్యం వీడాలి


క్షేత్రం వద్ద పూజలు చేస్తున్న బౌద్ధభిక్షువు సద్దా రక్కితా తదితరులు

నేలకొండపల్లి: బౌద్ధక్షేత్రాలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం విడనాడాలని బౌద్ధభిక్షువు సద్దా రక్కితా కోరారు. నేలకొండపల్లిలోని బౌద్ధ క్షేత్రాన్ని ఆదివారం సందర్శించిన ఆయన బుద్ధ పూర్ణిమ వారోత్సవాల్లో భాగంగా పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో క్షేత్రాలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. నేలకొండపల్లిలో క్షేత్రం వద్ద తాగునీరు కూడా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బౌద్ధభిక్షువుల భాగస్వామ్యంతో క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని, మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో దుద్దెల రవికుమార్ పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

తిరుమలాయపాలెం: పాత కక్షలతో ఓ మహిళపై దాడి చేసి గాయపరిచిన ఘటనకు సంబంధించి పోలీసు కేసు నమోదైంది. మండలంలోని సుబ్లేడుకు చెందిన వశపొంగు లక్ష్మిపై సుబ్లేడు, హస్నాబాద్ గ్రామానికి చెందిన ప్రతాప్, రాణి, మాగి భద్రమ్మ, రామ్మూర్తి, ప్రశాంత్, వశపొంగు మల్లయ్య శనివారం దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. దీంతో బాధితురాలి భర్త నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

మిరప నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి

- బహిరంగంగా మిరప, కూరగాయల నారు విక్రయిస్తే చర్యలు
- ప్రభుత్వం అనుమతించిన విత్తనాలతోనే నారు పెంచాలి
- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాధికారి జీవీ రమణ


జీ.వీ.రమణ


మిరప నర్సరీ

ఖమ్మంవ్యవసాయం: మిరప పంట సాగులో నారు ఎంపికే కీలకం. ప్రస్తుతం మిర్చి పంటకు దేశ, విదేశాల్లో డిమాండ్ ఉంది. ప్రధానంగా జిల్లాలో సాగు చేసే 'తేజా' రకం మిర్చికి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ధర పలుకుతోంది. దీంతో జిల్లాలో నీటి వనరులు ఉన్న రైతులు మిర్చి సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది మిర్చి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నట్లు ఉద్యాన శాఖ భావిస్తోంది. అయితే, ఎక్కువ మంది రైతులు నారు కొనుగోలుకు నర్సరీలను ఆశ్రయించనున్న నేపథ్యాన నర్సరీల యజమానులు పాటించాల్సిన జాగ్రత్తలపై జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి బీవీ రమణ పలు సూచనలు చేశారు.

ఈ సూచనలు పాటించాల్సిందే..

మిరప నర్సరీ యజమానులు 2017 నర్సరీ చట్టం ప్రకారం తప్పనిసరిగా లైసెన్సు పొంది ఉండాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి రమణ సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను కొనుగోలు చేసి నర్సరీల్లో పెంచాలని తెలిపారు. నర్సరీ లైసెన్సు కాలపరిమితి ముగియడానికి కనీసం 15 రోజులు ముందుగానే రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మిరప, కూరగాయ నారు పెంచి రైతులకు విక్రయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. నారు పెంపకంలో కోకోపిట్, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలపై ఉద్యాన అధికారుల సూచనలు పాటించాలని, యజమానులు తప్పనిసరిగా రిజిస్టర్లు నిర్వహిస్తూ, ఎరువుల వినియోగం, మొక్కల విక్రయం తదితర అంశాలను నమోదు చేయాలని తెలిపారు. రైతులకు నారు విక్రయించిన సమయాన తప్పక బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఇదే సమయాన రైతులు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని, అనుమతి లేని నర్సరీల్లో నారు కొని మోసపోవద్దని ఆయన సూచించారు.

నర్సరీల నిర్వాహకులు సంప్రదించాల్సిన ఉద్యాన అధికారుల నంబర్లు

నియోజకవర్గం	సెల్ నంబర్
ఖమ్మం	89777 14103
పాలేరు	89777 14104
మధిర నియోజకవర్గం, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాలు	89777 14113
వైరా నియోజకవర్గం, సత్తుపల్లి, వేంసూరు మండలాలు	89777 14105

'శాయ్' స్టేడియం హుళక్కేనా!

- ఆధునాతమైన స్టేడియంపై నీలినీడలు
- 18 ఎకరాలు కేటాయించినా సమయానికి స్పందించని యంత్రాంగం
- ఫలితంగా అదే భూమి ప్రభుత్వ కళాశాలలకు బదలాయింపు
- శాట్స్ పట్టింపులేని తనం, నిర్లక్ష్యమే కారణం

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లాలో క్రీడారంగం అభివృద్ధికి పాటుపడుతున్నామని అటు పాలకులు, ఇటు అధికారులు చెబుతున్న మాటలు అమలుకు నోచుకోవడం లేదు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి శివారులో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ఆధ్వర్యాన స్టేడియం నిర్మాణ విషయంలో ఎలాంటి పురోగతి లేకపోవడమే ఇందుకు నిదర్శనమని క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2019 జూన్ నెలలో ఆర్భాటంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకి చెందిన ఇద్దరు పరిశీలకులు జిల్లాకు పలుమార్లు వచ్చి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలం అనుకూలంగా ఉందని చెబుతూ తమకు అప్పగిస్తే అధునాతన స్టేడియం నిర్మిస్తామని జిల్లా యంత్రాంగానికి నివేదిక అందజేశారు. ఆపై ఉలుకూ పలుకు లేకపోవడంపై క్రీడా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

మల్టీపర్పస్ స్టేడియం

మద్దులపల్లిలో స్టేడియం నిర్మాణం కోసం 18 ఎకరాల స్థలాన్ని జిల్లా యంత్రాంగం కేటాయించింది. కానీ శాయ్ బాధ్యులు కానీ జిల్లా అధికారులు కానీ ఎందుకో పట్టించుకోలేదు. స్థలపరిశీలన చేసి నివేదిక సిద్ధం చేశాక కాస్త శ్రద్ధ చూపితే ఈ స్థలంలో ఆధునాతన స్టేడియం సిద్ధమయ్యేది. రూ.25 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ స్టేడియంగా నిర్మిస్తే క్రికెట్, అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వాలని భావించారు. కానీ స్థలం సేకరించడంలో జిల్లా యంత్రాంగం విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి. అయితే, నిధుల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సుముఖంగా లేకపోవడంతో పనులు ముందుకు సాగలేదని తెలుస్తోంది.

ఇప్పుడు మినీ స్టేడియం..

ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణం విషయంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ ప్రతిపాదనలు పక్కన పడినట్లు సమాచారం. దీని స్థానంలో మినీ స్టేడియం నిర్మిస్తామని ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలో ఐదెకరాల భూమి కేటాయించారు. ఇప్పుడు దీనికి సంబంధించిన పనులు జోరుగా సాగుతున్నాయి. కానీ జిల్లాలో క్రీడారంగం అభివృద్ధికి అవకాశమున్న అధునాతన స్టేడియం నిర్మాణం జరగకపోవడం మాత్రం అభిమానులకు గట్టిదెబ్బగా భావిస్తున్నారు.

రెండుసార్లు శాయ్ విఫలం

జిల్లా కేంద్రంలో సీక్వెల్ రిసార్ట్స్ పక్కన ఉన్న రెండెకరాల ఖాళీ స్థలాన్ని 2016లో అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఆర్చరీ సెంటర్ కోసం పరిశీలించారు. కానీ ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడంతో ఆర్చరీ సెంటర్‌ను తిరిగి సర్దార్ పటేల్ స్టేడియంలోనే ఏర్పాటు చేశారు. తిరిగి 2019లో మరోమారు ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలోని 18 ఎకరాల్లో అధునాతన స్టేడియం నిర్మించాలని ప్రతిపాదించినా అధికారులతో తీరుతో అదీ రద్దయింది. ఇక ఈ స్థలంలో జిల్లాకు మంజూరైన ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ లేదా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల భవనాలు నిర్మించాలనే యోచన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

రెన్యూవల్ చేయకపోవడమే కారణమా?

క్రీడారంగం అభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నెలకొల్పాల్సిన ఆధునాతన స్టేడియం నిర్మాణంపై ఆశలు పూర్తిగా గల్లంతైనట్లేనని తెలుస్తోంది. స్థలం కేటాయింపు, ప్రతిపాదనల తయారీకి సంబంధించి జిల్లా యంత్రాంగం, శాట్స్ ప్రతీ మూడేళ్లకోసారి రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉన్నట్లు సమాచారం. కానీ శాట్స్ అధికారులు ఒకటి, రెండుసార్లు పరిశీలించి ఆపై పట్టించుకోకపోవడంతో స్టేడియం ప్రతిపాదనలు బుట్టదాఖలైనట్లు తెలిసింది. అధికారులు మొదటి మూడేళ్లలోపు స్పందిస్తే జిల్లాలో మరో అధునాతన స్టేడియం అందుబాటులోకి వచ్చేది. అది జరగకపోవడంతో ఇప్పుడు ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలో నిర్మిస్తున్న మినీ స్టేడియంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

అలరించిన ఆస్తికలు నాటిక


ఆస్తికలు నాటికలోని ఓ సన్నివేశం


నృత్యప్రదర్శన ఇచ్చిన చిన్నారులతో నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: ఆస్తులు సమకూర్చుకోవడం, డబ్బు పోగేసుకోవడమే గొప్పగా భావిస్తున్నారని చెబుతూ.. ఒక కుటుంబంలో జరిగిన ఘటనల ఇతివృత్తంతో రూపొందించిన 'ఆస్తికలు' నాటిక ఆకట్టుకుంది. నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో గంగోత్రి పెదకాకాని కళాకారుల బృందం ఈ నాటికను ప్రదర్శించింది. పిన్నమనేని మృత్యుంజయరావు రచించిన ఈ నాటికకు గతంలో బంగారు నంది అవార్డు లభించింది. ఈ సందర్భంగా నాయుడు గోపి, వీసీహెచ్‌కే ప్రసాద్, గుడివాడ లహరి, డాక్టర్ బొక్కా శ్రీనివాసరావు, ఎస్.సూర్య, పి.వరప్రసాద్ వివిధ పాత్రలు పోషించగా, పరమేశ్, రమణ, నోరి రామ్మోహన్ సహకరించారు. అనంతరం ఖమ్మంకు చెందిన రాయల్ డ్యాన్స్ అకాడమీ మాస్టర్ సంతోషిణిరెడ్డి కూచిపూడి నృత్యాలయం చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళాసాంస్కృతిక సంస్థ కార్యదర్శి ఎ.సుబ్రహ్మణ్యకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగనని రవితో పాటు కాళ్ల పాపారావు, పోలాస్ శ్రీనివాస్, బైరి హరినాథబాబు, బయ్యన్న బాబు, మోటమర్రి జగన్మోహన్‌రావు, వేముల సదానందం, నామా లక్ష్మీనారాయణ, రవీందర్ పాల్గొన్నారు.

ఏపీ మాదిరిగా సబ్సిడీ ఇవ్వాలి


కూనంనేనికి వినతిపత్రం ఇస్తున్న ఈము రైతులు

ఖమ్మంమయూరిసెంటర్: ఈము రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకునేలా చూడాలని పలువురు కోరారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఖమ్మంలో పలువురు కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈము రైతులకు సబ్సిడీ ఇస్తున్నట్లుగా తెలంగాణలో కూడా ఇచ్చేలా ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. ఈము రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డితో పాటు గరికపాటి వెంకట్రావు, శ్రీనివాస్, ఆదినారాయణ, వీరయ్య, పాపిరెడ్డి, భరత్, గోవిందరావు, కృష్ణంరాజు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ సరఫరా లేక 500 కోళ్లు మృతి

మరమ్మతుల్లో ఆలస్యం.. జనరేటర్ లేకపోవడమే కారణం


ఫారంలో చనిపోయిన కోళ్లు

కల్లూరురూరల్: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురంలోని ఒక కోళ్ల ఫారంలో విద్యుత్ కోతతో ఉక్కపోతకు గురై 500 కోళ్లు చనిపోయాయి. ఈ ఘటనతో తనకు సుమారు రూ.6 లక్షల నష్టం వాటిల్లిందని కోళ్ల ఫారం యజమాని హరిప్రసాద్ రెడ్డి వాపోయాడు. ప్రీమాన్సూన్ పనుల్లో భాగంగా విద్యుత్ తీగలకు అడ్డుగా చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని అధికారులు ముందుగానే ప్రకటించారు. అయితే, మధ్యాహ్నం ఒంటి గంటకు బదులు సాయంత్రం 3.40 గంటలకు సరఫరా ఇచ్చారు. దీంతో ఉక్కపోతకు గురై, తాగునీరు సరఫరా లేక కోళ్లు చనిపోయినట్లు తెలుస్తోంది. అయితే, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల్లో ఆలస్యం జరగడంతోనే అనుకున్న సమయానికి సరఫరా ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదికాక కోళ్ల ఫారంలో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు యజమాని జనరేటర్ సమకూర్చుకోకపోవడం ఇంకో కారణమని సమాచారం.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి


బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యాంపై నుంచి జలాశయాన్ని, పర్యావరణ కేంద్రంలోని బొమ్మలను ఆసక్తిగా తిలకించారు. 850 మంది కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.28,770, 400 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.20,010 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

పాల కోసం వెళ్తుండగా ఘటన


బంగారు జీవన్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ఖమ్మం – ఇల్లెందు రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఆదివారం లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రగాయాలతో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ... ఖమ్మం 8వ డివిజన్ ఎల్‌బీ.నగర్‌కు బండారు జీవన్(18) తన మిత్రుడు షాహిద్ ద్విచక్ర వాహనంపై వెళ్లి పాలప్యాకెట్ తీసుకొస్తున్నాడు. ఈ క్రమాన ఇల్లెందు రోడ్డులోని ఖానాపురం సెంటర్ వద్ద వెనక నుండి వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ ఎగిరి రహదారిపై పడగా, వెనకాల కూర్చున్న జీవన్‌కు తీవ్ర గాయాలై మృతి చెందాడు. వాహనం నడుపుతున్న షాహిద్ చికిత్స పొందుతున్నాడు. కాగా, ఘటనాస్థలి వద్ద జీవన్ అచేతనంగా పడిపోవడంతో ఆయన మిత్రుడు షాహిద్ అక్కడ వాహనదారులను 'దండం పెడుతా ఆటో ఆపండి.. నా మిత్రుడును ఆస్పత్రికి తీసుకెళ్లండి' అంటూ రోదించిన తీరు అందరినీ కన్నీళ్లు పెట్టించింది. జీవన్ తండ్రి మూడేళ్ల క్రితం మృతి చెందగా తల్లి సుజాతతో కలిసి ఉంటూ ఇటీవలే ఇంటర్ పూర్తి చేశాడు. ఇంజనీరింగ్‌లో చేరేందుకు సిద్ధమవుతున్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో సుజాత కన్నీరుమున్నీరుగా విలపించింది.

లారీ ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలు

వైరారూరల్: వైరా మండలం గొల్లపూడిలోని వైరా – జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని లారీ ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన వృద్ధురాలు హరిదాసు ధనమ్మ రోడ్డు దాటుతుండగా వైరా వైపు నుంచి వెళ్తున్న లారీ ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ధనమ్మను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అయితే, ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్ ఘటనాస్థలిలోనే లారీని వదిలేసి పరారు కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈరోజు వండినవే రేపు కూడా..

- నిల్వ చేసిన ఆహార పదార్థాలే రోజుల తరబడి సరఫరా
- కొన్ని హోటళ్ల నిర్వాహకుల తీరు
- అధికారుల తనిఖీల్లో బట్టబయలు


ఓ హోటల్‌లో ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసిన మాంసం


కారం ప్యాకెట్‌పై వివరాలు పరిశీలిస్తున్న అధికారులు


ఓ హోటల్‌లో బిర్యానీని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ జ్యోతిర్మయి

ఖమ్మంమయూరిసెంటర్: ఉద్యోగ, వ్యాపారాలతో తీరిక లేని పలువురు కుటుంబంతో సహా అప్పుడప్పుడు రెస్టారెంట్లు, హోటళ్లలో భోజనం చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇందులో కుటుంబాలే కాక విద్యార్థులు, యువత కూడా ఉంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు హోటళ్ల నిర్వాహకులు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలోని పలు హోటళ్లలో పాడైపోయిన ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్నారని బయటపడడంతో జిల్లా కేంద్రంలో కూడా అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఆహార తనిఖీ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆదివారం ఖమ్మంలోని మూడు హోటళ్లల్లో తనిఖీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ వి.జ్యోతిర్మయి, నల్లగొండ, వనపర్తి ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పి.స్వాతి, వి.నీలిమతో పాటు ఖమ్మం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన హోటళ్లల్లోని వంటశాల, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా గడువు తేదీ, బ్యాచ్ నంబర్ లేని కొబ్బరి పొడి, పసుపు, నూడిల్స్, డ్రైఫ్రూట్స్ ఇతర పదార్థాలు ఉండడంతో సీజ్ చేశారు. అలాగే, ఓ హోటల్‌లో వండిన మాంస పదార్థాలు మిగలడంతో మరుసటి రోజు ఉపయోగించేందుకు ఫ్రిడ్జిలో నిల్వ చేసినట్లు తేలగా డ్రెయినేజీలో పోయించారు. నిబంధనలకు విరుద్ధంగా వంటగది నిర్వహణ ఉండడమే కాక ఆహార పదార్థాలను నిల్వ చేస్తుండటంతో ఎందుకు లైసెన్స్ రద్దు చేయకూడదో సమాధానం ఇవ్వాలని ఆయా హోటళ్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

విద్యుదాఘాతంతో మాజీ ఎంపీపీ మృతి

బావి మోటార్ పరిశీలిస్తుండగా ప్రమాదం


కాంపల్లి రాము (ఫైల్)

తల్లాడ: తల్లాడ మాజీ ఎంపీపీ కాంపల్లి రాము (48) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మండలంలోని నారాయణపురానికి చెందిన రాముకు భార్య, కుమారుడు, కుమార్తె ఉండగా.. ఆయన కుమార్తె హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండడంతో కుటుంబీకులంతా అక్కడే ఉంటున్నారు. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు రాము నాలుగు రోజుల కిందట స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఆయన స్నానం చేసేందుకు మోటార్ వేయగా పని చేయలేదు. దీంతో ఇంట్లోని బావి వద్ద వంగి మోటార్ వైరును పరిశీలిస్తుండగా షాక్ తగిలి బావి లోపల పడ్డాడు. ఈ శబ్దం విన్న ఇరుగుపొరుగు వారు చేరుకుని బయటకు తీసేసరికే ఆయన మృతి చెందాడు. కాగా, రాము 2006లో టీడీపీ తరఫున ఎంపీపీగా గెలుపొంది 2013 వరకు కొనసాగారు.

విద్యుదాఘాతంతో మహిళ..

కామేపల్లి: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన ఓ మహిళ మృతి చెందింది. కామేపల్లి మండలం ముచ్చర్లకు చెందిన చాదరాశిపల్లి పద్మ(50) ఇంటి చుట్టూ ప్రహరీ నిర్మిస్తుండగా ఆదివారం ఆమె పద్మ నీళ్లు పడుతోంది. ఈక్రమాన పక్కనే ఉన్న ఇనుప రేకులను తాకగా, రేకులకు కరెంట్ సరఫరా అవుతుండడంతో ఆమె షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

2.48 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం


గంజాయి తరలిస్తున్న ప్రైవేటు బస్సు

అశ్వాపురం: పుష్ప సినిమా తరహాలో ఓ ప్రైవేటు బస్సు లగేజీ కేబిన్‌లో హైదరాబాద్ తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సీతారాంపురం గ్రామంలో శనివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో చింతూరు నుంచి భద్రాచలం, అశ్వాపురం, ఏటూరునాగారం మార్గంలో హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేటు బస్సును తనిఖీ చేయగా సుమారు రూ. 66 లక్షల విలువైన 2.48 క్వింటాళ్ల గంజాయి లభ్యమైంది. గంజాయిని తరలిస్తున్న మహబూబ్‌నగర్‌కు చెందిన నరేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, భరత్‌కుమార్‌లను అరెస్ట్ చేశారు. సెల్‌ఫోన్లు, బస్సును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

టేకులపల్లిలో నాలుగు కేజీలు..

టేకులపల్లి: అక్రమంగా కారులో తరలిస్తున్న నాలుగు కిలోల గంజాయిని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్‌ఐ షేక్ సైదా రవూఫ్ కథనం ప్రకారం.. మండలంలోని గోలియాతండా సేవాలాల్ గుడి సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా, సుమారు రూ.లక్ష విలువైన నాలుగు కిలోల గంజాయి లభించింది. డొంకరాయి నుంచి కొత్తగూడెం మీదుగా జనగాం తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. పోలీసులు నిందితులు కార్తీక్, వంశీకృష్ణలను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

ఖమ్మంలో ఐపీ పెట్టిన వ్యక్తి ఏపీలో కిడ్నాప్?

విచారణ చేపట్టిన ఆంధ్రా పోలీసులు

ఖమ్మంక్రైం: జిల్లాలోని కల్లూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి ఇక్కడ ఐపీ పెట్టి ఏపీలో నివసిస్తుండగా, ఆయనను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు తెలిసింది. దీంతో ఏపీలోని నూజివీడుకు చెందిన పోలీసులు ఖమ్మంలో విచారణ చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. కల్లూరు ప్రాంతానికి చెందిన నాగరాజు పలువురి వద్ద అప్పులు చేసి కొన్నాళ్లుగా వడ్డీ చెల్లించిన అతను తర్వాత కనిపించకుండా పోయాడు. దీంతో బాధితులు గత జనవరిలో ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే కోర్టులో ఐపీ దాఖలు చేసిన ఆయన పరారీలో ఉన్నాడు. ఈ క్రమాన శనివారం ఏపీలోని నూజివీడుకు చెందిన ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. కొంతకాలంగా నాగరాజు నూజివీడులో నివాసముంటుండగా ఆయనను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు అందడంతో విచారణ కోసం వచ్చినట్లు తెలిపారు. దీంతో తమ వద్ద కూడా కేసు నమోదైందని తెలపగా.. నాగరాజుపై ఫిర్యాదు చేసిన వ్యక్తులను సైతం నూజివీడు పోలీసులు విచారించినట్లు తెలిసింది.

సాక్షి క్లాసిఫైడ్స్



■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185087]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640258899/ 9640468899 [H-799885]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
ఖమ్మం - 9705444182
9010299957